క్లుప్తంగా

విస్సాకోడేరులో అభివృద్ధి పనులు ప్రారంభం



విస్సాకోడేరులో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ బొల్లా శ్రీనివాస్

పాలకోడేరు: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా విస్సాకోడేరు సచివాలయం 2 పరిధిలో వంకాయల పాలెం, ముత్రాసి కాలనీ, పెదపేటలో సుమారు రూ.20 లక్షలతో సుమారు 259 మీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మాణలు చేపట్టామని సర్పంచ్ బొల్లా శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా విస్సాకోడేరు గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న లేఔట్‌లో భీమవరపు హనుమంతు ఇల్లు గృహ ప్రవేశంలో సర్పంచ్ బొల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

గజలక్ష్మి అవతారంలో సత్తెమ్మ అమ్మవారు



గజలక్ష్మి అవతారంలో సత్తెమ్మ

ఉండి: మండలంలోని పెదపుల్లేరు గ్రామంలో సత్తెమ్మ అమ్మవారు 59వ వార్షిక మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు గజలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఏడవరోజు శుక్రవారం కన్నుల పండుగలా అమ్మవారికి అభిషేకాలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఒక్కరికీ అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం: స్థానిక ఇండస్ట్రియల్ ఏరియాలోని సబ్ స్టేషన్ పరిధిలో గునుపూడి ఫీడర్ చెట్ల కొమ్మలు తొలగించడానికి పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు చినరంగనిపాలెం, రామచంద్రపురం, బొక్కవారిపాలెం, మారుతీ నగర్, మల్లె తోట, ప్రకృతి ఆశ్రమం, కలెక్టరేట్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు ఏబీఎస్‌వీకే ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మెంటే వారి తోటలోని సుందరయ్య భవనంలో ఆదివారం పక్షవాతం, ఫిట్స్, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రంలో విజయవాడకు చెందిన డాక్టర్ గోపాళం శివన్నారాయణ మెడికల్ క్యాంపులో వైద్యులు డాక్టర్ యస్.పూర్ణచంద్, జి.సత్యనారయణరాజు తదితరులు పాల్గొని వైద్య సేవలు అందిస్తారన్నారు. తక్కువ ధరలకే అవసరమైన ఔషధాలను నెలవారీగా అందిస్తారన్నారు. శిబిరానికి వచ్చే వారు ఒక రోజు ముందే సుగర్ పరీక్ష, రక్తపోటు స్థాయిలు చెక్ చేయించుకుని రిపోర్ట్స్‌తో రావాలని సూచించారు. శిబిరంలో కూడా బీపీ, సుగర్ పరీక్షలు ఉచితంగా చేస్తారని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలను అర్హులకు అందించాలి



వలంటీర్ల సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ గెద్దం భారతి

వీరవాసరం: ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ సక్రమంగా అందేలా వలంటీర్లు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని గ్రామ సర్పంచ్ గెద్దం భారతి తెలిపారు. రాయకుదురు గ్రామ సచివాలయ వలంటీర్లతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వలంటీర్లకు కేటాయించిన 50 కుటుంబాలకు సంబంధించిన పూర్తిస్థాయి సమాచారాన్ని దగ్గర ఉంచుకుని, ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను అర్హులైన వారందరికీ తక్షణం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో గ్రామ కార్యదర్శి బి దుర్గాప్రసాద్, మూర్తి, వంశీ పాల్గొన్నారు.

గోదావరికి పంచహారతులు

పెనుగొండ: మాఘ పౌర్ణమి సందర్భంగా సిద్ధాంతం కేదారీఘాట్‌లో వశిష్టాగోదావరికి శుక్రవారం రాత్రి హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పంచ హారతులు భక్తి శ్రద్ధలతో ఇచ్చారు. కలగ భద్రుడు స్వామి బ్రహ్మత్వంలో ఇలపర్రుకు చెందిన పాతపాటి సుబ్బరాజు, నాగమణి దంపతులు పూజలు నిర్వహించి గోదావరి మాతకు పంచ హారతులు ఇచ్చారు.

జగన్ పాలనలో రాష్ట్ర అభివృద్ధి

డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నరసింహరాజు



కోపల్లే గ్రామంలో సీసీ రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న పీవీఎల్, ప్రజా ప్రతినిధులు

కాళ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందని, ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తూ అభివృద్ధికి పెద్ద పీత వేశారని డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నరసింహరాజు తెలిపారు. మండలంలో కోపల్లె, బొండాడ పేట, జువ్వలపాలేం గ్రామాల్లో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. కోపల్లె గ్రామంలో జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులు రూ.35 లక్షలతో సీసీ డ్రెయిన్లు, సీసీ రహదారులు కలవర్టు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అదేవిధంగా బొండాడ పేట గ్రామంలో జిల్లా పరిషత్ నిధులు 30 లక్షలతో ప్రధాన రహదారి నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పీవీఎల్ నరసింహారాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాటను నెరవేర్చారన్నారు. ఇక ప్రజలు జగన్ మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధికి, సంక్షేమానికి రుణం తీర్చుకోవాలని గ్రామ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు, జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, బండాడ పేట గ్రామ సర్పంచ్ గొళ్ల వెంకట సత్యనారాయణ, ఉప సర్పంచ్ మధు, ఎంపీటీసీ సత్యనారాయణ,కోపల్లే సర్పంచ్ బుడి నాగమణి, ఉప సర్పంచ్ పరాలు, వీరమల్లు బోసు, పెనుమత్స రంగరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

గడప గడపకు నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు

కాళ్ల: గడపగడపకు మన ప్రభుత్వం అందించే నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు ఏర్పడుతున్నాయని డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నరసింహరాజు తెలిపారు. కాళ్ల మండలం జువ్వల పాలెం గ్రామంలో హరిజన పేటలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలు సీసీ రహదారి నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత తెలుగుదేశం పాలనలో హరిజన పేట రోడ్డు నిర్మాణ పనులు చేపట్టలేదని స్పష్టం చేశారు. ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో స్థానికులు రోడ్డు సమస్యలు తన దష్టికి తీసుకొచ్చారని చెప్పారు. దీంతో వెంటనే రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఆశీర్వదిస్తే గ్రామాల అభివృద్ధి, సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందుతాయని తెలిపారు. ఉండి నియోజకవర్గంలో కూడా వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేయాలని తద్వారా నియోజవర్గంలో గ్రామాలన్నీ అభివృద్ధి చెందుతాయని స్పష్టం చేశారు. రహదారి నిర్మాణం పనులు త్వరితగతిన నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు, జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఉప సర్పంచ్ కటారి లక్ష్మీపతి రాజు, పార్టీ నాయకులు రుద్రరాజు రామకృష్ణంరాజు, ముదిండి సురేష్ రాజు, ఎంపీటీసీలు మీసాల శ్రీనివాస్, గుర్రం బెనహర్, గోకరాజు వినోద్ రాజు, బోధనపు కన్నయ్య, సందీప్, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

జనసేన క్యాడర్ చూపు వైఎస్సార్ సీపీ వైపు



శ్రీనివాసరావు

భీమవరం: భీమవరంలో ఈనెల 22న జరిగిన పవన్ కళ్యాణ్ పర్యటన పేలవమని, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కూడా సరిగ్గా తెలియలేదని జనసేన నాయకుడు శ్రీనివాసరావు అన్నారు. వీరవాసరం మండలం నందమూరుగరువు గ్రామ పార్టీ అధ్యక్షుడు కొప్పినీడి శ్రీనివాసరావు శుక్రవారం భీమవరంలో విలేకరులతో తో మాట్లాడుతూ జనసేన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ వైపు చూస్తున్నారని స్పష్టం చేశారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు(చిన బాబు) వైఖరి పార్టీలో అనేకమందికి నచ్చడం లేదని, తక్షణం ఆయనను పార్టీ పదవి నుంచి తప్పించకపోతే భీమవరం నియోజకవర్గంలో 2019 ఎన్నికల ఫలితాలే పునరావృతం అవుతాయన్నారు. భీమవరంలో పవన్‌కల్యాణ్ పర్యటన సమాచారం ఇవ్వనందువల్లే నాయకులు, కార్యకర్తలకు తెలియక పేలవంగా జరిగిందన్నారు. జనసేనకు అండగా ఉండి జెడ్పీటీసీ, మండల పరిషత్ పదవులను దక్కించుకున్న వీరవాసరం మండలంలోనే పరిస్థితి ఇలా ఉంటే జిల్లా పరిస్థితి ఏంటో తేటతెల్లం అవుతుందన్నారు.

వేసవిలో తాగునీటి నివారణకు చర్యలు



పైపులైన్ విస్తరణ పనులకు భూమిపూజ చేస్తున్న డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: వేసవిలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఏ ప్రాంతంలోను తాగునీటి ఎద్దడి రానీయకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని ఉప్పులూరులో జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.21.75 లక్షతో చేపట్టనున్న తాగునీటి పైపులైన్ విస్తరణ పనులకు భూమిపూజ, మండల పరిషత్ నిధులు నిధులు రూ.5 లక్షలతో పూర్తి చేసిన ఫిల్టర్ మీడియా పనులను ప్రారంభించారు. అనంతరం పీవీఎల్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఉండి, కాళ్ల, ఆకివీడు, పాలకోడేరు మండలాల్లోని తాగునీటికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. జగనన్న కాలనీల్లోను తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, ఎంపీటీసీ నిమ్మల కేశవకుమార్(బాలు),గ్రామపార్టీ అధ్యక్షుడు కుంచాడ వెంకటేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ నిమ్మల సత్యనారాయణ (బాబ్జి), చెన్నకేశవ స్వామి ఆలయ ఛైర్మన్ యర్రా వెంకటసుబ్బారావు,జీ సుందర్‌కుమార్, యర్రా రాంబాబు, యర్రా గణపతి, వడ్లమన్నాడ సాయిబాబు, గ్రామపంచాయతీ కార్యదర్శి శివ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అభినందనలు



కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న వీరయ్య చౌదరి

భీమవరం (ప్రకాశంచౌక్): నూతన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీని వయోవృద్ధుల సంక్షేమ అప్పిలేట్ ట్రిబ్యునల్ సభ్యుడు మేళం దుర్గాప్రసాదు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వయవృద్ధుల సంక్షేమ ట్రిబ్యునల్‌కు వచ్చిన ఫిర్యాదులపై జిల్లా కలెక్టరుకు ఆయన వివరించారు. అలాగే నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సుమిత్ కుమార్ గాంధీని జిల్లా ప్రజారవాణా శాఖ అధికారి ఎ.వీరయ్య చౌదరి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షం



పెదపుల్లేరు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, సర్పంచ్ తదితరులు

ఉండి: ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సురక్షగా నిలిచారని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని పెదపుల్లేరులో ఏర్పాటు చేసిన 2- జగనన్న ఆరోగ్యసురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ ప్రారంభించారు. అనంతరం వైద్య శిబిరంలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీస్తూ స్థానిక నాయకులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజల ఆరోగ్యమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. నిపుణులైన వైద్యులు రావడంతో పాటు 14 రకాల వైద్య పరీక్షలు చేసి రోగులకు వైద్యం అందజేసి, ఉచితంగా మందులను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జానపద సృజనాత్మక కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, సర్పంచ్ కరణం పార్వతి, ఎంపీటీసీ రాయి రావులమ్మ ,కరణం వెంకటేశ్వరరావు, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు యడ్ల సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు గుల్ల అప్పన్న, రాయి శ్రీను, పప్పుల రాంప్రసాద్, నల్ల సత్తిబాబు, ఒగ్గిన సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసేవారికి సముచిత స్థానం



లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావును సత్కరిస్తున్న శ్రీనివాస్

భీమవరం: వైఎస్సార్ సీపీ పటిష్టం కోసం అంకితభావంతో పనిచేసే వారందరికీ సముచిత లభిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితుడైన కామన నాగేశ్వరరావు పట్టణంలోని న్యాయవాదులతో కలిసి శుక్రవారం క్యాంపు కార్యాలయంలో శ్రీనివాస్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ కోసం పని చేసే వారందరినీ గుర్తుంచుకుని తగిన విధంగా వారికి పదవులు కట్టబెడుతున్నారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింతగా కష్టపడి రాబోయే ఎన్నికలలో 175 సీట్లు సాధించి మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిగా చేయాలన్నారు. ముందుగా నాగేశ్వరరావును దుశ్శాలువాతో ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏఎస్ రాజు, పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు బడుగు అశోక్ బాబు, నియోజకవర్గ అధ్యక్షుడు పేటేటి పెద్దిరాజు, కందికట్ల నాగరాజు, సాడె నాగరాజు, పొట్టి జోసఫ్ రాజు, జి.సుందర్ కుమార్, రొక్కాల సుబ్బయ్య, వింటకుర్తి నాగ మాధవి, సాన నాగబాబు, సప్పా గణేష్, బొలిశెట్టి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఆకివీడు: అంగన్‌వాడీ ప్రాజెక్టు ఆకివీడు పరిధిలోని పాలకోడేరు మండలంలోని రెండు ఆయా పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రాజెక్టు అధికారిణి విజయ రత్నం శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పాలకోడేరు మండలంలోని కుముదవల్లి-1 పోస్టుకు ఓసి అభ్యర్థిని, 2 పోస్టుకు బీసీ బీ అభ్యర్థిని నుంచి దరఖాస్తు కోరుతున్నట్లు తెలిపారు. మార్చి 1వ తేదీ సాయంత్రం 5గంటలలోపు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

29న ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సు



భీమవరంలో బ్రోచర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

భీమవరం: ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సును ఈ నెల 29న భీమవరం పట్టణం వీరమ్మ పార్క్ సెంటర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు సామాజికవేత్త గోళ్ళమూడి రాజసుందరబాబు చెప్పారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ చట్టం 1989, సవరణల చట్టం 2015, 2018-ఎస్సీ ఎస్టీ రూల్స్, సంబంధిత జీఓలపై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. అవగాహన సదస్సుకు శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ, ఎస్పీ వేజెండ్ల అజిత, ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొంటున్నారన్నారు. అనంతరం సదుస్సు బ్రోచర్‌ను విడుదల చేశారు. సమావేశంలో దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పొన్నామండ బాలకృష్ణ, గోడి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సౌకర్యాలను వినియోగించుకోవాలి



జగనన్న వైద్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎం అండ్ హెచ్ఓ మహేశ్వరరావు

వీరవాసరం: ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు, వైద్య సేవలను ప్రజలంతా వినియోగించుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ మహేశ్వరరావు తెలిపారు. వీరవాసరం మండలంలోని రాయకుదురు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రజల ఆరోగ్య సమస్యలపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముందుగా సర్పంచ్ గెద్దం భారతి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. రక్త పరీక్షకలు, కళ్లె పరీక్షలు, ఈసీజీ, బీపీ, సుగర్ పరీక్షలు, జనరల్ వ్యాధులకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ దేవదాసు, పోలిశెట్టి సత్యనారాయణ, పోలిశెట్టి శివన్నారాయణ, పీహెచ్‌సీ వైద్యులు హర్షిత, పాల లీల, గెద్దం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ ఫౌండేషన్ ఏర్పాటు



కోరుకొల్లులో గ్లోబల్ ఫౌండేషన్ గురించి వివరిస్తున్న మంతెన యోగేంద్ర కుమార్ బాబు

పాలకోడేరు: మన్యం జ్యోతి విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతిని పురస్కరించుకుని అమెరికాలోని వివిధ ఉద్యోగాల్లో, వివిధ వృత్తుల్లో స్థిర పడిన ప్రవాసాంధ్రులు అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ ఏర్పాటు చేశారని మంతెన ప్రహ్లాదరాజు చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ మంతెన యోగీంద్రకుమార్(బాబు) తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మాతృదేశానికి తమ వంతు సేవలు అందించి, జన్మభూమి రుణం తీర్చుకోవాలని లక్ష్యంతో ఈ స్వచ్ఛంద సంస్థను స్థాపించడం జరిగిందన్నారు. ఈ సంస్థ కు భూపతిరాజు పండేటిరాజు ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ ఫౌండేషన్ ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 75 గ్రామాలను దత్తత తీసుకుని, అక్కడి పేద ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడం జరుగుతుందన్నారు. తొలి విడతగా ఆంధ్ర ప్రదేశ్ లోని 16 గ్రామాలను దత్తత తీసుకొవడం జరిగిందన్నారు. ప్రస్తుతం మన జిల్లాలో కోరుకొల్లు, మైప , వెంప, శ్రీరామపురం, గోటేరు గ్రామాలను దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. వైద్య సేవలు అందించేందుకు తిరుపతిలోని స్విమ్స్, బర్డ్ హాస్పిటల్స్ ను, అమలాపురంలోని కిమ్స్ హాస్పిటల్‌ను, హైదరాబాద్ లోని బసవరామ తారకం క్యాన్సర్ హాస్పిటల్ ను, భీమవరం వర్మ హాస్పిటల్‌ను, విష్ణు డెంటల్ కాలేజీ హాస్పిటల్‌ను, రాజమండ్రిలోని పరమహంస యోగానంద ఐ హాస్పిటల్ తోను ఫౌండేషన్ ఒప్పందం కుదుర్చుకుందన్నారు. కోరుకొల్లు, మైప గ్రామాల్లో తన ఆధ్వర్యంలో ఈ సేవలు నిర్వహిస్తామని తెలిపారు.

పీవీఎల్‌కు కృతజ్ఞతలు తెలిపిన మోటుపల్లి



డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్. నర్శింహారాజును కృతజ్ఞతలు తెలిపిన మోటుపల్లి గంగాధరరావు

ఆకివీడు: భీమవరం ఎన్నికల పరిశీలకులుగా నియమించేందకు సహకరించిన డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్.నర్శింహారాజును శుక్రవారం మర్యాదపూర్వకంగా పరిశీలకుడు మోటుపల్లి గంగాధరరావు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. భీమవరం అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి తన శక్తి మేరకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్‌ఛైర్మన్ పుప్పాల పండు, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ జగ్గురోతు విజయ్‌కుమార్, కౌన్సిలర్ నిమ్మల నాగు, వాడపల్లి జగన్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితుల్ని ఆదుకుంటాం



స్థానిక అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆకివీడు: అగ్ని ప్రమాద బాధితుల్ని ఆదుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు తెలిపారు. స్థానిక సంతపేటలోని ఇల్లాపువారి వీధిలో ఇటీవల విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో రేకు షెడ్డు దగ్ధమైన సంఘటనలో బాధితులకు రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే 50 కేజీల బియ్యం, నిత్యవసర వస్తువులు అందజేసినట్లు పీవీఎల్ చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్ సీపీ కమిటీ అధ్యక్షుడు అంబటి రమేష్, కుంచాడ బాబ్జీ, రుంకాని శ్రీహరి, బండారు వెంకటరత్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రైతులపై దాడులు అప్రజాస్వామికం

భీమవరం: ఢిల్లీలో రైతులపై ప్రభుత్వం చేస్తున్న దాడులు అప్రజాస్వామికమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారాం దుయ్యబట్టారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయం వద్ద శుక్రవారం రైతుల పోరాటంలో మృతి చెందిన రైతు శుభకరణ్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఢిల్లీ వెళ్తున్న రైతులపై హర్యానా పోలీసులు దుర్మార్గంగా కాల్పులు జరిపారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, చింతకాయల బాబురావు, జేఎస్‌పీ గోపాలన్, బి.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలి



కేపీ పాలెంలో మాట్లాడుతున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు

మొగల్తూరు: కేపీపాలెం బీచ్‌లో ఏర్పాటు చేసిన దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి 20 అడుగుల కాంస్య విగ్రహం ప్రారంభోత్సవాన్ని జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు కోరారు. శుక్రవారం మండలంలోని కేపీ పాలెంలో పార్టీ నాయకుడు అల్లం అంజిబాబు నివాసంలో ఏర్పాటు చేసిన నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మంజూరు చేసిన రూ.కోటితో వైఎస్ రాజశేఖరరెడ్డి 20 అడుగుల కాంస్యవిగ్రహంతో పాటు ఆయన జీవిత విశేషాలను తెలిపేలా నిర్మించిన స్మృతివనాన్ని ఈ నెల 27న ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కేపీపాలెం- పేరుపాలెం ప్రధాన రహదారి నుంచి మెట్రీవు నుంచి వయా అల్లంవారిమెరక మీదుగా కేపీ పాలెం బీచ్ వరకూ రూ.8 కోట్లతో నిర్మించే రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. రాష్ట్ర మంత్రులతో పాటు పలువురు ఎంపీలు పాల్గొనే ఈ కార్యక్రమాలను జయప్రదం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు, సర్పంచ్ కడలి సోంబాబు, ఎంపీటీసీ సభ్యుడు డీవీవి సత్యనారాయణ, నాయకులు కర్రి ఏసుబాబు, కంచర్ల బాబులు, అల్లం చిన్న పాల్గొన్నారు.

అనారోగ్యం భరించలేక మహిళ ఆత్మహత్య

యలమంచిలి: శారీరక ఆరోగ్యం దెబ్బతినడంతో నొప్పుల బాధలు తాళలేక దొడ్డిపట్ల పంచాయతీ కుమ్మరపాలెం గ్రామానికి చెందిన దొడ్డా ధనలక్ష్మి (60) గురువారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కాకి శివనారాయణ తెలిపారు. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇద్దరు కుమారులు పెళ్లిళ్ల తరువాత వేర్వేరు కాపురాలు పెట్టుకోగా ధనలక్ష్మి భర్తతో కలసి జీవిస్తుంది. ఆమె భర్త నాగేశ్వరరావు కొబ్బరిఈనెల వ్యాపారం చేస్తుంటాడు. ఆరోగ్యం సహకరించకపోవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ధనలక్ష్మి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.